# "బ్రతుకుతో చెలగాటం"

కుమారి మలినేని మంజూష

"నేను లేకుంటే నీవు జీవించగలవా కృష్ణా!" అతని తలను తన వక్షస్థలములో పొదిగించుకొని అడిగింది మాలతీ కృష్ణ. అతను చిరునవ్వు నవ్వాడు. "నేను లేకపోతే నువ్వు పిచ్చివాడుగా మారుతావు అవునా కృష్ణా!" అడిగింది మళ్ళీ.

"ఏమో నాకు తెలియదు"

"ఏం?"

"నేను ఎప్పుడూ ఆలోచించలేదు కనక"

ఆమె అహం దెబ్బతిన్నది. "అంటే నేను లేకపోయినా నువ్వు సుఖంగా ఉండగలుగుతావన్నమాట, అంతేగా?" అతనిని విసిరికొట్టి ఆమె దూరంగా జరిగింది. అతను ఆశ్చర్యపడలేదు.

"కాదు మాలతీ ఎందుకు తొందరపడతావు. నువ్వు లేకపోతే నాకు చాల కష్టమే!"

"ఊరడింపా?"

"కాదు"

"మరి యిందాక అట్లాగన్నావే?"

"నాకు తెలియదన్నాను అంతే"

"అంటే, నా అవసరం మీకు తెలిసిరాలేదన్నమాటేగా?"

"కాదు నువ్వు లేకపోతే నా కథలను ఫేర్ కాపీ ఎవరు చేసిపెడ్తారు?"

"నువ్వు రాసిన కథలను ఫేర్ కాపీ చేసి పెట్టడానికే నన్ను పెండ్లి చేసుకొన్నావన్నమాట!"

"అబ్బ నీకు తొందర ఎక్కువ. నారోజువారీ పనులకు నీవు చాల అవసరం"

"అంటే మీదగ్గర సేవకావృత్తి చెయ్యడానికా? నేను ఈరోజే మా ఊరికి పోతున్నాను. అప్పుడుగాని నా అవసరం తెలిసిరాదు.

"అపార్థం చేసికొంటున్నావు."

"నా ప్రయాణం ఆగదు."

♦ ♦ ♦

గుడివాడ, 19-8-57

ప్రియమైన కృష్ణకు,

నేను యిక్కడకు వచ్చినతర్వాత ఎన్ని ఉత్తరాలు వ్రాసినా జవాబు వ్రాయలేదు. నీ విషయం జ్ఞాపకం వస్తే ఆందోళనగా ఉంటోంది. నా ఎడబాటు నీ ఆరోగ్యాన్ని పాడుచేసి ఉంటుంది. నేను దగ్గర లేకపోతే ఏమీ తోచక పిచ్చిపట్టినట్లు ఉంటుంది. నా రాకకోసం ఎదురు చూస్తూఉంటావు. నీకోసం రేపే అక్కడికి వస్తున్నాను. మిగతా విషయాలు అక్కడికి వచ్చిన తర్వాత మాట్లాడుకుందాం.

నీ......
మాలతీకృష్ణ.

"ఇప్పటికైనా నా అవసరం గుర్తించావా కృష్ణా!" అడిగింది మాలతీకృష్ణ, అతని భుజంపై చేతులు వేస్తూ

"గుర్తించవలసిన అవసరం కలుగలేదు. నాపనులు నేనే చేసుకొనటం నేర్చుకొన్నాను."

"కొయ్యవు. నేను లేకపోతే నువ్వు పిచ్చివాడిగా మారలా? చంద్రుని చూసి విరహగీతాలు పాడలా?" సూటిగా ప్రశ్నించింది మాలతీకృష్ణ.

"లేదు. నాకు పాడటంరాదు. నేను రచయితనుమట్టుకే. పిచ్చి అప్పటికి పుట్టలేదు. హాయిగానే బ్రతికాను."

ఆమె అభిమానం దెబ్బతింది. అతని చెయ్యి పట్టుకొని "అబద్ధం! నేలేకుండా నువ్వు బ్రతకలేవు" అంది నిశ్చయాభిప్రాయంతో; "అందుకే నీకోసం పరుగెత్తుకొని వచ్చాను"

"నేను కోరలేదు. నువ్వు ఒంటరిగా బ్రతకలేక వచ్చావు."

"నాకోసం నేను రాలేదు. నువ్వు నన్ను తలచుకొని

దుఃఖిస్తూ కృశించి ఉంటావని వచ్చాను.

"పొరపాటు పడ్డావు. నువ్వు లేకుండా నేను బ్రతకగలను. బ్రతికాను. బ్రతుకుతాను. కాని నేను లేకపోతే నువ్వు బ్రతకలేవు. అది నీవల్ల కాదు."

"గర్వపడకు. ఇన్నాళ్లు నిన్ను విడిచి ఒంటరిగానే ఉన్నాను."

"అయినా యింకొకరి పోషణక్రింద. నీ పోషణలో నువ్వు బ్రతకలేవు. అది నీవల్ల అవుతుందా? నా అవసరం నీకు అవసరం."

"నేను ఒంటరిగా బ్రతకగలను. స్త్రీనయినంత మాత్రాన నీ అండ లేకుండా బ్రతకలేననుకున్నావా? ఇక్కడకన్నా ఎక్కువ భోగ భాగ్యాలను అనుభవించగలను. నావల్ల అది అవుతుంది."

"సరి మంచిది. ఇన్నాళ్లూ నన్ను పీడిస్తున్న సందేహం తీరింది."

"నేను వెళ్ళిపోతున్నాను."

"ఎక్కడికి?"

"నాకే తెలియదు."

"పరిహాసాలొద్దు."

"నిజం."

"మళ్లీ ఎప్పుడొస్తావు?"

"చెప్పలేను. బహుశా నువ్వు నా అవసరం తెలిసికొన్నప్పుడు, నేను సొంతంగా బ్రతకలేనప్పుడున్నూ. వెళ్తున్నాను."

"సరే వెళ్ళు. ఒక్కటి గుర్తుంచుకో. నేను నీ అవసరం లేకుండానే బ్రతుకగలను. నీ సహాయం నాకు ఉపయోగపడదు."

"మంచిది."

వెంటనే మాలతీకృష్ణ తన పేరులోని ఆఖరి రెండు అక్షరములను కసిగా కొట్టివేసింది. ★

బిడ్డల లివరు అండు స్ప్లీను వ్యాధులకు

# పాత్రుడుగారి బాలసంజీవిని

డాక్టరు పిల్లా పాపయ్యపాత్రుడు & బ్రదరువారి "బాలసంజీవిని" నిజముగ అమోఘమైనది. బిడ్డలకు సంభవించు లివరు అండు స్ప్లీను వ్యాధులలో ప్రథమ దశయందుగాని, కాంప్లికేటెడ్ స్థితియందు గాని తప్పకుండ గుణమిచ్చును. వైద్యవృత్తియందును నా స్నేహితులలోను బంధుకోటిలోను అనేకులు ఉపయోగించుటవల్లను "బాలసంజీవిని" యొక్క గుణాతిశయములు పరీక్షించుట కవకాశమేర్పడినది. బజారులోగల యితర లివరు ఔషధములుగూడ యిదివరలో వాడి చూచితినిగాని "బాలసంజీవిని" వాడిన పిమ్మట పైవాటినెల్ల విసర్జించి దీనినే హెచ్చుగ వాడుచున్నాను. అమోఘముగ నిట్టి మహౌషధమును ప్రజోపయోగమునకు వినియోగించుచున్నందుకు పిల్లావారి వంశము స్తుతిపాత్రమైనది.

డాక్టరు : .........................

వివరములకు:

## డాక్టరు పిల్లా పాపయ్యపాత్రుడు & బ్రదర్సు,

నెం. 19, దక్షిణమాడా వీధి, మైలాపూరు, మద్రాసు 4.

ఫోను : 71354

కుంభకోణం బ్రాంచి :

## నెం. 7 శారంగపాణికోవిల్

తూర్పు వీధి.

అన్ని మందుల షాపులలోను దొరకును.